అందరూ ఆహ్వానితులే!

- మెట్టుగూడ చర్చికి ఆంగ్లో ఇండియన్ చర్చిగా మరోపేరు
- ప్రతీ మంగళవారం సేవా కార్యక్రమాలు
- క్రిస్మస్‌కు ప్రత్యేక ఏర్పాట్లు



సెయింట్ ఆంథోనీ చర్చి

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్ ప్రాంతంలో ఎన్నో ప్రాచీన, చరిత్రాత్మక చర్చిలు ఉన్నప్పటికీ మెట్టుగూడ చర్చి ప్రత్యేకత వేరు. కులమతాలకతీతంగా ఆధ్యాత్మిక చింతన కలిగిన వారందరికీ స్వాగతం పలుకుతోంది మెట్టుగూడలోని ఆంగ్లో ఇండియన్ చర్చి. ప్రతీ మంగళవారం మెట్టుగూడ ప్రధాన రహదారిలోని ఈ ప్రార్థనా మందిరం పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆహార పదార్థాలు దానం చేయడం కోసం నగరం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. మెట్టుగూడ పుర వీధుల్లో నగర సంకీర్తనలు నిర్వహించడం, మతాలు ఏవైనా భక్తుల అవసరం మేరకు ప్రతివారం గృహాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం చర్చి నిర్వాహకుల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఆంగ్లో ఇండియన్స్ కోసం..

నగరంలో స్థిరపడిన 15 తమిళ కుటుంబాలు 1925 ప్రాంతంలో ప్రతీ మంగళవారం చేసుకున్న సామూహిక ప్రార్థనలకు ప్రతిరూపంగానే మెట్టుగూడ చౌరస్తాలోని సెయింట్ ఆంథోనీ చర్చి వెలిసింది. ఈ చర్చిని ఆంగ్లో ఇండియన్స్ చర్చి అనే మరోపేరు కూడా పిలుస్తుంటారు. నగరంలో స్థిరపడిన ఆంగ్లో ఇండియన్స్ అందరు ప్రార్థనల కోసం ఇక్కడికి వస్తున్నందున సెయింట్ ఆంథోనీ చర్చికి ఆంగ్లో ఇండియన్ చర్చి అనే మరో పేరు కూడా వాడుకలో ఉంది. ఇక్కడ క్రైస్తవులే కాదు అన్ని మతాలవారు ప్రార్థనలు చేసుకునే అవకాశం ఉండడం గమనార్హం. నాటి నుంచి నేటి వరకు ప్రతీ మంగళవారం ఈ ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, పేదలకు ఆహార పదార్థాలు, అన్నదానం చేయడం ఆనవాయితీ. అదేరోజు సగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించి వారానికి ఒకరి ఇంట్లో సమావేశమై సామూహిక భజనలు చేస్తుంటారు.

ఆవిర్భావ క్రమమిదీ..

క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పూజించుకునే సెయింట్ ఆంథోనీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని మెట్టుగూడ ప్రధాన రహదారి (అప్పటి మోడీ సెంటర్) వద్ద ఆరు బయటే ప్రతీ మంగళవారం భజనలు చేసుకునేవారు. భజనలో పాల్గొనే తమిళ సభ్యులు అందరు కలిసి ప్రనిధ ఆంథోనియార్ భజనాయి కోడమ్ (సెయింట్ ఆంథోని భజన సంఘం) ను ఏర్పాటు చేసుకున్నారు. వీరి భక్తి విశ్వాసానికి మెచ్చిన ఆస్ట్రేలియాలో స్థిరపడిన క్లాకోపీటర్స్ అనే మహిళ మెట్టుగూడ చౌరస్తాలోని తన స్థలాన్ని 1972లో సెయింట్ ఆంథోనీ పేరుతో చర్చి నిర్మించేందుకు స్థలాన్ని విరాళంగా ఇచ్చింది. సదరు స్థలాన్ని స్వీకరించిన పారిస్ మతగురువు బందనమ్ జులియస్ నేతృత్వంలో చర్చి నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి నగరంలో స్థిరపడిన ఆంగ్లో ఇండియన్స్ అందరు ఇక్కడే ప్రార్థనలు చేయడం ప్రారంభమైంది. ఈ క్రమంలోనే దీనికి ఆంగ్లో ఇండియన్ చర్చిగా పేరు వచ్చింది.

క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లు..

సికింద్రాబాద్ ప్రాంతంలో అత్యధికంగా నివసిస్తున్న క్రిష్టియన్లు ఏటా క్రిస్మస్ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. డిసెంబర్ మాసం వచ్చిందంటే చాలు ఈ ప్రాంతంలో క్రిస్మస్ వెలుగులతో సికింద్రాబాద్ ప్రాంతం కొత్త వెలుగులతో నిండిపోతుంది. వేడుకల కోసం అన్ని చర్చిలు ముస్తాబవుతుండగా ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యే సెయింట్ ఆంథోనీ చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చి పరిసర ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

హస్తం గూటికి సదా కేశవరెడ్డి?



రసూల్‌పురా: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శ్రీ గణేష్‌కు మద్దతిచ్చిన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి త్వరలో హస్తం గూటికి చేరనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో భేటీ కానున్నారు. నిజానికి బీజేపీ నాయకులు ఈటల రాజేందర్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీగణేష్‌కు మద్దతిచ్చిన సదా కేశవరెడ్డికి ఎన్నికల కన్నా ముందే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జి పదవి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కానీ.. ఈటల ప్రోద్బలంతో బీజేపీకి మద్దతిచ్చిన కేశవరెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నిజానికి 2008లో సదా కేశవరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచే బోర్డు సభ్యుడిగా రెండవ వార్డు నుంచి పోటీ చేసి గెలిచారు. 2014లో టీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ మద్దతుతో బోర్డు సభ్యుడిగా గెలిచి బోర్డు ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. బీఆర్‌ఎస్ నుంచి ఈటల బయటికి వచ్చి తర్వాత సదా కేశవరెడ్డి కూడా బీజేపీలో చేరారు. కొన్ని రోజులకే ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం తన నివాసంలో కేశవరెడ్డి మాట్లాడుతూ.. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు.

ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న సభ్యులు

లాలాపేట: లాలాపేటలోని లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవస్థానంలో ఈ నెల 27న జరగనున్న అయ్యప్ప స్వామి మహాపడి పూజకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆహ్వానించారు. ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీనివాసులు గౌడ్ స్వామి నేతృత్వంలో పలువురు స్వాములు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, ప్రసాద్, సురేందర్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి



సికింద్రాబాద్‌: సికింద్రాబాద్ మెట్టుగూడలోని అయ్యప్ప దేవాలయంలో మండల పూజ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీకమాసపు ప్రత్యేక పూజలు ముగించిన ఆలయ నిర్వాహకులు కేరళ తంత్రీలు, శబరిమల సంప్రదాయ పద్ధతుల్లో మండల పూజను ఈ నెల 27న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో స్థిరపడిన మళయాళీయుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెట్టుగూడ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతీ ఏటా మండల పూజలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ ప్రతినిధి వినోద్ నంబియార్ తెలిపారు. చిలకలగూడ నుంచి రైల్వే క్వార్టర్స్ మీదుగా మెట్టుగూడ ఆలయం వరకు అయ్యప్ప ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆదివారం బొల్లారంలోని ట్రీనిటి చర్చి, మూడవ వార్డులోని పలు చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలోఎమ్మెల్యే లాస్యనందిత పాల్గొని కేక్‌కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నివేదిత, మురళీ యాదవ్, చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని ఆర్య వైశ్య సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం ప్రతినిధులు నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు నాగబండి సుధాకర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీకాంత్, శ్రీనివాస్, వీరేశం, గణేష్‌రావు, వెంకటేష్, నర్సింగ్‌రావు, శ్రీధర్, చంద్రశేఖర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవాలు



పద్మారావునగర్: సికింద్రాబాద్ హరిహరకళా భవన్‌లో ఆదివారం తెలంగాణ తమిళ సంఘం 5వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. తమిళనాడు రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుంచి విచ్చేసిన కళాకారుల సంగీత, నృత్య, వాద్య, గాత్ర కచేరిలతో అలరించారు. నాదస్వరం, భరతనాట్యం, శివతాండవం వంటి కళాప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. నగర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తమిళులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరిక్రిష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ సంస్కృతి, సాంప్రదాయాలకు కాపాడుకోవాలని కళా పరిరక్షణ అందరి బాధ్యత కావాలన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తమిళ సంఘం అధ్యక్షులు యంకే బోస్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి ఎస్. శాస్త్రీ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంగణంలో ఆదివారం శ్రీ అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజ ప్రాంగణాన్ని రంగు రంగుల పువ్వులతో అందంగా అలంకరించారు. పడిపూజ కార్యక్రమంతో ఈ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తి పాటలతో అయ్యప్ప స్వాములు నృత్యాలు చేయడం కనిపించింది.

శాశ్వత భవన నిర్మాణానికి చొరవ చూపాలి


కోట నీలిమకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌కు శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమను ఆదివారం కలిసి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు తమ అసోసియేషన్ తరుపున ఎన్నో ఏళ్లుగా వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. 2 వేల కన్నా ఎక్కువ పుస్తకాలు ఉన్నాయని, వాటిని అందరికీ అందుబాటులో ఉంచేందుకు సరైన లైబ్రరీ స్థలం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు అసోసియేషన్ భవనం నిర్మిస్తే అందులోనే లైబ్రరీ వసతి కూడా కల్పించే అవకాశం ఉంటుందన్నారు. స్పందించిన కోట నీలిమ మాట్లాడుతూ.. అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జెక్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు గంగాధర్‌రావు, ఉమామహేశ్వర్‌రావు, గుత్తా నాగేశ్వర రావు, జనార్ధన్‌రావు ఉన్నారు.

అణగారిన వర్గాలకు దిక్సూచి కావాలి


కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రొ. గాలి వినోద్‌కుమార్, రాజేశ్వర్

బన్సీలాల్‌పేట్: అణగారిన వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి డిక్కా సంస్థ దిక్సూచిగా నిలవాలని ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. బన్సీలాల్‌పేట్‌లో డిక్కా(డెవలపింగ్ ఎస్సీ, ఎస్టీ బిజినెస్ ఎంటర్ ప్రెన్యూర్స్ సంస్థ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, శాసన మండలి మాజీ సభ్యులు రాజేశ్వర్ రావు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా తమ వృత్తినైపుణ్యాలతో పాటు శక్తిసామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలన్నారు. డిక్కా సంస్థ విద్యావంతులైన నిరుద్యోగ యువతకు వ్యాపారపరంగా ఎదగడానికి చేయూతనివ్వాలని కోరారు. డిక్కా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు రాగటి భవానీకుమార్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు అన్ని విధాలా చేయూతనిచ్చి అభివృద్ధి చేయడానికి సంస్థ ఏర్పాటు చేశామన్నారు. డిక్కా సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిక్కా గౌరవ చైర్మన్ రాగటి సత్యం మాదిగ, పారిశ్రామికవేత్త పి. శ్రీనివాస్, చింత సాంబమూర్తి, డాక్టర్ శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంబీలో ముగిసిన శిక్షణ



ప్రొ.కేవీ రావును సన్మానిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సీపీఎంబీలో నైపుణ్య అభివృద్ధి అనే అంశంపై రెండు వారాలు జరిగిన శిక్షణ ఆదివారంతో ముగిసింది. బయో టెక్నాలజీ, సీపీఎంబీ సౌజన్యంతో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. తరగతి గదిలో సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగాత్మక బోధన జరగాలన్నారు. వివిధ రంగాల శాస్త్రవేత్తలు, అధ్యాపకులు శిక్షణ పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బిట్స్ పిలాని అధ్యాపకులు డా.అహ్మద్ కమాల్, సీపీఎంబీ డైరెక్టర్ డా.రామకృష్ణ హాజరవ్వగా ఇన్సా సైంటిస్టు అవార్డుకు ఎంపికైన మాజీ డైరెక్టర్ ప్రొ.కేవీరావును ఘనంగా సన్మానించారు.

క్రిస్మస్ సందడి షురూ


విద్యుద్దీపాలతో సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి

సనత్‌నగర్: క్రిస్మస్ శోభతో నియోజకవర్గ ప్రాంత రహదారులు సందడిగా మారాయి. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల కాంతులతో ప్రార్థనా మందిరాలు కనువిందు చేస్తున్నాయి. సోమవారం క్రిస్మస్ పర్వదినం కాగా క్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలియజేస్తూ చర్చిల్లో ఆదివారం సాయంత్రం నుంచే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు రూపకల్పన చేశారు. సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా, ఫ్లైఓవర్ పక్కన గల మెథడిస్ట్ చర్చి, ఎండీ ఇమానుయేల్, సీఎస్ఐ, బాప్టిస్టు, బల్కంపేట్‌లోని యునైటెడ్ ఇండిపెండెంట్, యేబ్రోను చర్చిలతో పాటు సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే కేకులు కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.


ముస్తాబైన గల మెథడిస్ట్ చర్చి


విక్రయాలకు సిద్ధంగా ఉన్న స్టార్స్

అమ్మకానికి వర్సిటీ డైరీలు, కేలండర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2024 నూతన సంవత్సరం డైరీలు, క్యాలండర్లను జనవరి 1 నుంచి విక్రయించనున్నారు. ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల విద్యార్థులు, అధ్యాపకులు, ఇతరులకు విక్రయించనున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరీకి రూ.500, సాధారణ డైరీకి రూ.100, క్యాలండర్‌కు రూ.130గా ధర నిర్ణయించారు. ఎగ్జిక్యూటివ్ డైరీకి ముందుగా ఆర్డర్ ఇవ్వాలని ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొ.రాములు తెలిపారు.

వాజ్‌పేయి సేవలు స్ఫూర్తిదాయకం


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దత్తాత్రేయ

సనత్‌నగర్: అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు స్ఫూర్తిదాయకమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి స్పోర్ట్స్ లీగ్‌ను ఆదివారం సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని మారుమూల గ్రామాలకు అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వాజ్‌పేయి పేరిట స్పోర్ట్స్ లీగ్‌ను నిర్వహించడం ద్వారా యువతలో స్ఫూర్తిని నింపినవారవుతారన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన మణికంఠ(36) ఇది వరకు ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. కొంత కాలంగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుండటంతో అప్పులు పెరిగాయి. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గృహిణి అదృశ్యం


వరమ్మ

లాలాపేట: ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. నాచారంలోని సింగం చెరువు ప్రాంతానికి చెందిన శంకర్‌తో లావణ్య అలియాస్ వరమ్మ(30)కు ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇదిలా ఉండగా భర్త శంకర్ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండడంతో ఆమె సపర్యలు చేస్తోంది. ఏళ్లు గడిచినా శంకర్ వ్యాధి నయం కావడం లేదు. ఇళ్లలో పాచిపని చేసుకునే వరమ్మ తన భర్తకు సేవలందించలేక ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వరమ్మ తిరిగి రాకపోవడంతో శంకర్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 62, పందిరి బీర 55, క్యాబేజీ 16, క్యారెట్ 37, దొండ 55, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 73, గోకరకాయ 50, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 47, మొరంగడ్డ 25, కందగడ్డ 45, సొరకాయ 19, పొట్లకాయ 18, మునగకాయ 4–6.

ప్రపంచమంతా నిర్వహించే పండగ క్రిస్మస్


క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ప్రపంచం మొత్తం గొప్పగా నిర్వహించుకునే పండగ క్రిస్మస్ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో క్రైస్తవ ప్రముఖుల సమక్షంలో ఆదివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చర్చి పాస్టర్లు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరి, హేమలత, పాస్టర్లు శ్యాంసన్, విజయ్, క్రైస్తవ ప్రముఖులు ఫ్రాంక్లిన్, ప్రశాంత్, రాజ్‌గోపాల్, దాస్, విలియమ్, జయరాజ్, మనోహర్, టోనీ, పాల్, రాజన్ పాల్గొన్నారు

ఆలయాల అభివృద్ధి అభినందనీయం..


కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అమీర్‌పేట: ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.ఆదివారం అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద సీనియర్ సిటిజన్ పార్థసారథి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.14 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అమ్మవారి రథం మండపాన్ని తలసాని ప్రారంభించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అనేక ఆలయాలు ప్రభుత్వ, దాతల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు.వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ మల్లికార్జునప్ప, సభ్యులు ఆకుల రాజు, పద్మావతి, అరుణ, సహదేవ్‌గౌడ్, లింగమయ్య, బీఆర్‌ఎస్ నేతలు సంతోష్, ఎం.లలితచౌహాన్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.